కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో..టమాటా రూ.33, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 55, బజ్జీ మిర్చి 40, క్యాప్సికమ్ 61, పచ్చకాకర 48, పందిరి బీర 51, క్యాబేజీ 18, క్యారెట్ 37, దొండ 40, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 55, గోకరకాయ 55, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 28, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఘనంగా ఘటోత్సవాలు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గత నెల 29న అమ్మవారి ఘటాల ఎదుర్కోలుతో ఘటోత్సవాలు మొదలయ్యాయి. ఈనెల 13, 14వ తేదీల్లో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర జరుగనుంది. అయితే అమ్మవారి ఘటం ఈ నెల 11వ తేదీ వరకు ప్రతిరోజూ ఒక్కో బస్తీలో తిరుగుతూ భక్తులకు దర్శనం ఇస్తుంది. వాడవాడలా తిరుగుతున్న అమ్మవారి ఘటానికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సోమవారం అమ్మవారి ఘటం ఉప్పరబస్తీ తదితర ప్రాంతాల్లో భక్తులకు దర్శనం ఇచ్చింది. ఈ నెల 13, 14వ తేదీల్లో మహంకాళి బోనాల జాతర జరుగనుండడంతో ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ సోమవారం క్యూ లైన్లు పరిశీలించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అమ్మవారిని దర్శించుకున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయ హుండీలకు దేవాదయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం లెక్కించినట్లు ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్ తెలిపారు. రూ.87,24602 ఆదాయం సమకూరిందన్నారు. అన్నదాన రూపంలో రూ.106555 వచ్చాయన్నారు. 34 అమెరికా డాలర్లు, దిరామ్స్ 10, రియాల్స్ 5, పౌండ్స్ 10, థాయిలాండ్ కరెన్సీ 20, మిక్స్‌డ్ బంగారం, వెండి ఆభరణాలు కూడా భక్తులు అమ్మవారి హుండీలో వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సాయిబాబాగౌడ్, కనకదుర్గ ఆలయ ఈఓ అంబుజ, దేవాదయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

దర్గా పునర్నిర్మాణ పనులకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న జంపన ప్రతాప్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు ఈద్గా అంబేడ్కర్‌నగర్‌లో గౌస్ -ఏ ఆజాం దస్తగిర్ దర్గా పునర్నిర్మాణ పనులకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ సోమవారం భూమిపూజ చేశారు. హిందు ముస్లింలు ఐక్యంగా దర్గా నిర్మాణ పనులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అస్గర్, అస్లాం, రఫీక్, చాంద్‌బాను, సాంసన్‌రాజు, నరేష్, శంకర్, చిన్నరాజు, దబ్బేట శ్రీను, జగదీష్, ప్రశాంత్, పాండు, సన్నీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఘటం ఊరేగింపు



చిలకలగూడ: బోనాల జాతర పర్వదినాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ ఉజ్జయినీ అమ్మవారి ఘటాన్ని సీతాఫల్‌మండి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం ఊరేగించారు. చిలకలగూడ, శ్రీనివాసనగర్, ఉప్పరిబస్తీ, ఫ్రైడేమార్కెట్, మైలార్‌గడ్డ, నామాలగుండు తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారి ఘటానికి స్థానిక ప్రజలు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 13, 14 తేదీల్లో ఉజ్జయినీ అమ్మవారి బోనాల జాతర ఉండగా 20, 21 తేదీల్లో చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ బోనాల జాతర నిర్వహిస్తారు. అమ్మవారి ఘటం ఊరేగింపులో కుమార్, వెంకటేష్, మునీష్, దీపిక ముదిరాజ్, శ్రీధర్‌ముదిరాజ్, సోను, నాయుడు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్.. నో రెస్పాన్స్!

• మూడు అవకాశాలిచ్చినా స్పందన కరువే • కేవలం 145 దరఖాస్తుల ఫీజు చెల్లింపు • పెండింగ్‌లో 1256 దరఖాస్తులు



సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ జోనల్ పరిధిలో అనుమతి లేని లేఅవుట్ స్థలాల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) రాయితీ గడువు ముచ్చటగా మూడోసారి ముగిసింది. పొడిగించిన ప్రకారం క్రమబద్ధీకరణ గడువు ముగిసినా జీహెచ్‌ఎంసీ అధికారులు ఆశించిన ఆదాయం రాబట్టలేకపోయారు. జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం ఐదు సర్కిళ్ల పరిధిలో మొత్తంగా 4,795 దరఖాస్తులు ఉండగా ఇందులో ఫీజు చెల్లించి, ప్రొసీడింగ్‌లు పొందడం కోసం 1401 దరఖాస్తులను అధికారులు ఆమోదించారు. వీరందరికీ పలుమార్లు సమాచారం అందించి ఫీజు మొత్తంలో 25 శాతం రాయితీ ఇచ్చారు. అయినప్పటికీ కేవలం 145 మంది దరఖాస్తుదారులు మాత్రమే ఫీజు చెల్లించారు. తద్వారా జీహెచ్‌ఎంసీకి కేవలం రూ.2.52 కోట్ల ఆదాయం చేకూరింది.

మొదటి నుంచే మందకొడిగా..

ఈ ఏడాది మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు ఫీజుల్లో 25 శాతం రాయితీ ఇస్తూ ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆ తర్వాత మరో రెండు దఫాలు రాయితీ గడువు పెంచారు. రాయితీ గడువు మొదటి రోజు నుంచి ఈ కార్యక్రమం అంతా మందకొడిగా సాగింది. అన్ని సర్కిళ్ల కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి, దరఖాస్తుదారులకు జీహెచ్‌ఎంసీ సిబ్బంది వందల కొద్ది ఫోన్‌కాల్స్ చేసినా ఐదు సర్కిళ్ల పరిధిలో కేవలం 145 మంది మాత్రమే స్పందించారు. ఎస్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో నెలకొన్న జాప్యం, గందరగోళ పరిస్థితుల ఫలితంగానే దరఖాస్తు దారుల నుంచి కనీస స్పందన రాకపోవడానికి కారణాలుగా తెలుస్తుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దరఖాస్తు దారులు పేర్కొన్న స్థలాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి మార్కెట్ విలువ ఆధారంగా ఫీజు నిర్ణయించడం జరిగేది. ఈ ప్రక్రియ తర్వాత దరఖాస్తుదారులు చెల్లించేవారు. పర్యవేక్షణకు ముందే ఫీజు చెల్లించాలని ఇప్పటి ప్రభుత్వం నిర్ణయించడంతో చాలా మంది దరఖాస్తుదారులు వెనుకడుగు వేశారు. పైగా వాయిదా పద్ధతిలో చెల్లించేందుకు అవకాశం లేకపోవడం, ఒకేసారి రుసుం మొత్తం చెల్లించాలన్న నిబంధన దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారింది. ఇంకొందరి భూములు నిషేధిత జాబితాలో చేర్చడంతో కూడా అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

అందని ప్రొసీడింగ్‌లు..

రాయితీని వినియోగించుకుని ఎల్‌ఆర్‌ఎస్ స్థలాలకు ఫీజులు చెల్లించిన దరఖాస్తు దాలరులకు ప్రొసీడింగ్స్ అందించడంలోనూ జీహెచ్‌ఎంసీ అధికారులు జాప్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ, నీటి పారుదల, సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడంతో అనుమతుల్లో జాప్యం జరుగుతున్నట్టు సమాచారం. ఎల్‌ఆర్‌ఎస్ స్కీం మొదలైన తొలినాళ్లల్లో ఫీజులు చెల్లించిన వారంలోనే ప్రొసీడింగ్స్ జారీ చేస్తామని అధికారులు ప్రచారం చేశారు. తీరా ప్రొసీడింగ్స్ జారీ కోసం నెలలు గడుస్తుండటంతో సాంకేతిక కారణాలు చూపుతున్న అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులు పలుమార్లు జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇదిలా ఉండగా రాయితీ సమయం ముగిసిందని, రాయితీ లేకుండా ఫీజు చెల్లించే అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఫీజులు చెల్లించిన దరఖాస్తు దారులకు త్వరితగతిన ప్రొసీడింగ్స్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

పేదలకు నష్టం జరిగితే ఊరుకోను

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వం పేదలకు నిర్మించి ఇచ్చిన గృహ సముదాయాలు శిథిలావస్థకు చేరుతున్నా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శిథిల భవనాల్లో నివాసముంటున్న వారంతా బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం లాలాపేట చంద్రబాబునాయుడు నగర్‌కు చెందిన గృహసముదాయం నుంచి పెచ్చులు ఊడిపడ్డాయి.ఈ నేపథ్యంలో హౌజింగ్ అధికారులతో సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. హౌజింగ్ అధికారులు పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారని పేదలకు నష్టం జరిగితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. చంద్రాబాబునాయుడు నగర్‌లో దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రభుత్వ నివాస సముదాయాలు మొత్తంగా శిథిల స్థితికి చేరి తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇక్కడి భవన సముదాయాన్ని తక్షణమే మరమ్మతు చేయాలని నిపుణుల కమిటీ సిఫారసు చేసినా హౌజింగ్ అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. అనంతరం ఈ సమస్య గురించి జిల్లా కలెక్టర్ హరిచందనకు ఫోన్‌లో వివరించారు.

చెక్కుల పంపిణీ..

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 31 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, మరో ఇద్దరి వైద్య ఖర్చుల కోసం లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాలను సోమవారం ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం భారంగా మారిన దశలో వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్న లక్ష్మి, కంది శైలజ, రాసూరి సునీత పాల్గొన్నారు.

దరఖాస్తుల అందజేత..

అడ్డగుట్ట: బోనాల ఉత్సవాలకు సంబంధిచిన నిధుల దరఖాస్తులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్‌కు అడ్డగుట్ట బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం అందజేశారు. అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వీకరించిన దరఖాస్తుల జాబితాను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు సుందర్, నాయకులు లింగాని శ్రీనివాస్, మనోహర్, శ్రీనివాస్‌గౌడ్, దాసరి శ్రీనివాస్, పొన్నాల రాజు, అమర్, శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు



ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

లాలాపేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను సోమవారం తార్నాక డివిజన్ లాలాపేటలో ఘనంగా నిర్వహించారు. లాలాపేట ఇసుకబాయి వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో తార్నాక డివిజన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు గంథమల్ల రాజలింగం పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక ఉద్యమాల నిర్మాత కృష్ణమాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 31 ఏళ్ల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమ కార్యక్రమాలను గుర్తు చేశారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ సమస్య కృష్ణమాదిగ నాయకత్వంలోనే పరిష్కారం అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో పరమేష్, నాగులు,మల్లారపు ప్రభాకర్, జనగాం యాదగిరి పాల్గొన్నారు.

మెట్టుగూడలో..

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. మొదట ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేసి మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకల సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మంద కృష్ణమాదిగ నేతృత్వంలో 31 సంవత్సరాలుగా సాగిన ఉద్యమం, ఆ మీదట ఎస్సీ రిజర్వేషన్లకు లభించిన చట్టబద్ధత అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, విజయ్‌రావు, సత్యనారాయణ, సీతారాం, కుమార్, జి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: కుందన్‌బాగ్, సీఎం క్యాంప్ ఆఫీసు, సంజీవయ్య పార్కు, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు ఐఏఎస్ క్వార్టర్స్, ఐపీఎస్ క్వార్టర్స్, మినిస్టర్స్ క్వార్టర్స్, సీఎం ఓల్డ్ క్యాంప్ ఆఫీసు, సీఎం బిల్డింగ్, సీఎం రెసిడెన్స్, మంజీరా గెస్ట్‌హౌస్, చీఫ్ జస్టిస్ హౌస్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీఈ బిల్డింగ్, తాజ్‌వివంతా, టోపాజ్ బిల్డింగ్, నవదుర్గా జ్యువెలర్స్, ఏరియల్ టవర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని తెలిపారు.

లాలాగూడ, ఐఐసీటీ సబ్‌స్టేషన్ పరిధిలో..

రాంగోపాల్‌పేట్: లాలాగూడ, ఐఐసీటీ సబ్‌స్టేషన్‌పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సబ్‌డివిజన్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒటి గంట వరకు లంబాడీబస్తీ, కనకదుర్గ అపార్ట్‌మెంట్, సండే మార్కెట్, విజయ డైరీ, ఘరౌండా అపార్ట్‌మెంట్, డేవిడ్ మెమోరియల్ కాలేజ్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చొరవ తీసుకోవాలి



రామ్‌చందర్‌రావును కలిసిన నాయకులు

లాలాపేట: తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ద్వారా ప్రత్యేక గుర్తింపు కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల కమిటీ చైర్మన్ బండి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల నూతనంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావును సోమవారం తార్నాకలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ రామ్‌చందర్‌రావుకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.వెంకటేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

బోనాలు అంటేనే ఊరంతా సందడి: ఎమ్మెల్యే తలసాని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఆషాఢ బోనాలు అంటేనే హైదరాబాద్ జంట నగరాల్లో నెల రోజుల పాటు ఎంతో సందడిగా ఉంటుందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో సోమవారం దక్కన్ మానవ సేవా సమితి, ఆర్యసమాజ్ ప్రతినిధులు ఈ నెల 13న మహంకాళి ఆలయంలో నిర్వహించే హోమానికి హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాల ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని, వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 11న మహంకాళి ఆలయ పరిసరాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించనున్నట్లు చెప్పారు. అన్ని ఏర్పాట్లు సమగ్రంగా జరిగేలా పర్యవేక్షించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యసమాజ్ అధ్యక్షుడు మాశెట్టి శ్రీనివాస్, మంత్రి కంది విశ్వనాథం, దక్కన్ మానవ సేవా సమితి అధ్యక్షుడు శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్‌గౌడ్, సభ్యులు రఘుమోహన్, గడ్డం రాజేష్, నర్సింగ్ రావు, కమల్‌కుమార్ పాల్గొన్నారు.

9న ఫుడ్ లైసెన్స్ మేళా

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ నార్త్ జోన్ కార్యాలయంలో ఈ నెల 9న ఫుడ్ లైసెన్స్ మేళా నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ రవికిరణ్ తెలిపారు. ఆహార వ్యాపారులందరు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలని ఆదేశించారు. వ్యాపారులు అవసరమైన సహాయం పొందడం కోసం ఫుడ్ లైసెన్స్ మేళాకు వచ్చి సహకరించాలని కోరారు. లైసెన్స్ ఉన్నవారు రెన్యూవల్ చేసుకోవడం, కొత్తగా లైసెన్స్‌లు పొందడం కోసం అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు మేళాలో వ్యాపారుల సందేహాలు నివృత్తి చేస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళాను నిర్వహిస్తామన్నారు.

కోట నీలిమకు ఆహ్వానం



సనత్‌నగర్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరతో పాటు ఘటాల ఊరేగింపు, రంగం ఉత్సవాలకు హాజరుకావాలని ఆలయ అధికారులు సోమవారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమకు ఆహ్వానం పలికారు. దేవస్థానం ఈఓ మనోహర్‌రెడ్డితో పాటు పలువురు సభ్యులు, అర్చకులు ఆమె కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. జూలై 13, 14 తేదీల్లో జరిగే బోనాల పండుగ, రంగం, ఘటాల ఊరేగింపు నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె వారికి సూచించారు. అలాగే ఈ నెల 10న జరిగే గురుపూర్ణిమ ఉత్సవాలకు హాజరుకావాలంటూ బాపునగర్ వీరాంజనేయ, వెంకటేశ్వర, షిర్డీ సాయిబాబా దేవస్థానం ప్రతినిధులు సైతం ఆహ్వానం పలికారు.

పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర కీలకం



పారిశుద్ధ్య కార్మికులకు శానిటేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర కీలకమైనదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు శానిటేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించగలరన్నారు. కార్మికులు పారిశుద్ధ్య విధుల నిర్వహణతో పాటు తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ పాండునాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధనగౌడ్, శానిటరీ సిబ్బంది జహంగీర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న మహేష్ ముదిరాజ్

పంజగుట్ట: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఒక్క హామీ అమలు చేయకుండా మోసం చేస్తున్నారని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి రాష్ట్ర నాయకులు సుంకరబోయిన మహేష్, అశోక్ ముదిరాజ్, రాంచందర్, పులి దేవేందర్, రంజిత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్ జాతి బిడ్డకు మంత్రివర్గంలో స్థానం కల్పించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలని, అదే తరహాలో ఎన్నికలకు ముందు ముదిరాజ్‌లకు ఎన్నో హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయాలని కోరారు. 40 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ఇటీవల ప్రకటించిన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, ఉపాధ్యక్షుల పదవుల్లో కేవలం రెండు పదవులు కేటాయించడం దారుణమన్నారు. సమావేశంలో రవి, శేఖర్, చందు, రవి ముదిరాజ్ పాల్గొన్నారు.

కష్టమర్ల తరహాలో వచ్చి.. ఖరీదైన చీరలు ఎత్తుకెళ్లారు..

అమీర్‌పేట: కష్టమర్ల తరహాలో షాపునకు వచ్చిన మహిళలు ఖరీదైన పట్టు చీరలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బల్కంపేట సిక్స్ ఫీట్ రోడ్డులోని లిథికా సిల్క్స్ చీరల షాపునకు ఆదివారం మధ్యాహ్నం ఐదుగురు మహిళలు వచ్చారు. అత్యంత ఖరీదైన చీరలు చూపించాలని బడాయి మాటలు చెప్పారు. షాపులో పనిచేసే సిబ్బంది దృష్టి మరల్చి రూ.99 వేలు విలువైన 10 పట్టు చీరలు అపహరించారు. వారు వెళ్లి పోయిన అనంతరం స్టాకు పరిశీలించగా చీరలు తగ్గినట్లు కనిపించడంతో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. సదరు మహిళలు చీరలను కాజేసిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. చీరల దుకాణం యజమాని ఎన్.అపర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయ బ్రహ్మోత్సవాల ముగింపు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. సోమవారం సుప్రభాతం, తిరువారాధన, సేవాకలం, నివేదన, యాగశాల ఆరాధన, అగ్ని ఆరాధన, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, రాజభోగ నివేదన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ బ్రహ్మోత్సవ ముగింపు కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారి కటాక్షం ప్రజలందరిపై ఉండాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అల్లాడి గౌరిశంకర్, సభ్యులు నందికంటి రవి, కే శ్రీనివాస్, వీరేష్, పరమేశ్వరి, రాజగోపాలచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సనత్‌నగర్: విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో సోమవారం సర్జరీ చేయించుకున్న కానిస్టేబుల్ మహేష్‌ను నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పరామర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ..ప్రమాదానికి గురైన కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. రాత్రి, పగలూ సమయాల్లో విధులు నిర్వర్తించే బ్లూ కోల్ట్స్ రక్షక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీసీపీ వెంట బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి ఉన్నారు.

లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి

సికింద్రాబాద్: లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సోమవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం ముందు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్న లెబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు నెలసరి వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ నెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారుర. భాస్కర్, రామారావు, మహ్మద్ అంజత్ తదితరులు పాల్గొన్నారు.



వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



బంజారాహిల్స్: వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని జూబ్లీ హిల్స్ సర్కిల్–18 డీపీవో ఆశా విరానిక సూచించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీనగర్‌లో టౌన్ లెవల్ ఫెడరేషన్(టీఎల్‌ఎఫ్) సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రతి మహిళ కోటీశ్వరురాలు కావాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో పథకాలు తీసుకొస్తుందని మహిళా సమాఖ్యల అధ్యక్షులు వీటిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ఆసక్తి ఉన్నవారికి అవకాశాలు కల్పించేలా చూడాలని సూచించారు. 2024–25 సంవత్సరానికి 251 సెల్ఫ్ హెల్ఫ్ గ్రూపులకు రూ.33,29,300 లక్షలు మంజూరైనట్లు ఆమె వెల్లడించారు. త్వరలోనే ఆర్పీలో ఆయా బ్యాంకులకు వెళ్లి వెరిఫికేషన్ చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారని, అర్హత ఉన్న ప్రతి మహిళకు రుణం ఇప్పిస్తామని తెలిపారు. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత అర్హత కలిగిన మహిళలందరికీ నియోజకవర్గ స్థాయిలో సమావేశం నిర్వహించి ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేల చేతులమీదుగా ఈ రుణాల పంపిణీ ఉంటుందని వెల్లడించారు.